# చావు ఖరీదు

## వీరభద్రరావ్ పమ్మి

''నువ్వు హైదరాబాద్ వెళ్లి పెద్ద హాస్పిటల్లో చూపించుకోవాలి దేవుడూ!''

రాజమండ్రి హాస్పిటల్లో పెద్ద డాక్టర్ గారు చెప్పారు. దేవుడికి గుండెల్లో రాయి పడింది. పక్కనే ఉన్న అతని కూతురు మహాలక్ష్మి మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు.

''అయ్యా!'' అయిదు నిముషాల తర్వాత గొంతుపెగుల్చుకుని పిలిచాడు.

''చెప్పు'' డాక్టర్‌గారు చాలా ఆదరంగా అడిగారు.

''ఈ జబ్బు తగ్గుతాదా? నేను... నేను... బతుకుతానా?'' అతని కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

డాక్టర్ ఏంచెప్పాలా అని ఆలోచిస్తున్నాడు. ''నాకింకా బతికి భూవిని ఉద్దరిద్దామని లేదయ్యా. ఇదిగో ఈ పిల్లుండాదికదా — అదేమో పెళ్ళయిన సంవత్సరానికే పసుపు కుంకాలు వదిలేసుకుని తెల్లసీర కట్టుకుని పుట్టింటి కొచ్చేసింది. నాకు... నాకు ఏదేనా అయితే అది ఒంటరిదైపోతాది— అదే నా బెంగ.''

దేవుడు చెప్తుంటే డాక్టర్ తను చెప్పాల్సిన మాటలు సిద్ధం చేసుకున్నాడు.

''చూడు నేను చెయ్యాల్సిన పరీక్షలన్నీ చేసాను. మరి—ఆపరేషన్ చేయించుకోవాల్సి వస్తుందేమో అనుమానంగా వుంది. ఆ విషయం పెద్ద పరీక్షలు చేయిస్తే కాని తేలదు'' అన్నాడు డాక్టర్.

''అదేబాబూ— ఆపరేషన్ చేయించుకుంటే బతుకుతానా?''

''తప్పకుండా బతుకుతావు. కాకపోతే ...''

''సెప్పండి బాబూ—మీరు అయిదరాబాద్ ఎళ్లాలన్నప్పుడే గుండెల్లో రాయిపడింది. ఇంక మీరేం సెప్పినా బయపడను'' అతని మాటల్లో తెగింపు విపిపిస్తోంది.

''ఏం లేదు—ఆపరేషన్‌కి చాలా ఖర్చవుతుంది.''

ఖర్చు

ఖర్చు

ఖర్చు

''అసలీ కర్చులన్నవి లేకుండా—ఈ డబ్బన్నది లేకుండా పెపంచం ఉంటే ఎంత బాగుండును...'' అనుకున్నాడు దేవుడు.

కానీ ప్రపంచం అతననుకున్నట్టుగా ఉండదు. అతను దేవుడు కాదు. దేవుడనే పేరున్న ఓ మామూలు మనిషి.

* * * *

రాజమండ్రిలో డాక్టర్‌కి చూపించుకుని ఇంటికి తిరిగి వచ్చి రెండురోజులైంది.

జబ్బు విషయంగానీ, డబ్బు విషయంగానీ, హైదరాబాద్ వెళ్లాలనే విషయంగానీ—అతను కూతురితో ప్రస్తావించలేదు. కూతురు అతనితో ప్రస్తావించలేదు.

ఆ విషయం ఇద్దరి మనసుల్లోనూ సుళ్లు తిరుగుతోంది.

మూడోరోజున మహాలక్ష్మి అంది.

''మాస్టారి అబ్బాయిని అడిగాను. ఆయన వస్తానన్నారు.

''ఎక్కడికి?''

''హైదరాబాద్—వచ్చి పెద్ద హాస్పిటల్లో దగ్గరుండి చూపిస్తానన్నారు. ఆయనకావిషయాలన్నీ బాగా తెలుసు.''

దేవుడు అయిదు నిముషాలపాటు ఏమీ మాట్లాడలేదు. తండ్రి ఏమంటాడోనని మహాలక్ష్మి ఆశగా, ఆత్రంగా చూస్తోంది.

''మరి అంత డబ్బు...''

''నా దగ్గరుండి—ముందు వెళ్లి చూపించుకుందాం. పరీక్షలు చేయించుకుందాం — ఆపరేషన్ పడుతుందంటే— మిగతా విషయాలు అప్పుడు ఆలోచించుకుందాం.''

అంత డబ్బు ఆమె దగ్గర ఎలా ఉందో అతనికి అర్థం కాలేదు. ఆ విషయం అడగాలా వద్దా— అని అతను ఆలోచిస్తున్నాడు.

''నా పుస్తెలు అమ్మేసాను.''

అతనికి నోటమాట రాలేదు.

''అవి కట్టినవాడు కట్టెల్తో కలిసి బూడిదైపోయాడు. ఇంకా ఎందుకని?''

పంతులుగార్నడిగాను. ఆదివారం మంచిదని చెప్పారు. బైల్దేరి హైదరాబాద్ వెడదాం. టిక్కెట్లు కొనమని మాస్టార బ్బాయికి డబ్బిచ్చాను.

''రాలిపోయే పండుమీద అనవసరంగా డబ్బు కర్సెడుతున్నావే. ఇంకా నీ జీవితం ఎళ్లాలి.''

''ఆ మాటలన్నీ వద్దు. ఆరోగ్యం ముఖ్యం. నీకేవన్నా అయితే నేను...''

మహాలక్ష్మి గొంతు గాద్గికమైంది.

* * * * *

దేవుడి కళ్లముందు గతమంతా నీడలా కదలడం మొదలెట్టింది. అతనావూళ్లో రెండెకరాల ఆసామీ. పెళ్లి చేసుకున్న అయిదేళ్లవరకు పిల్లలు కలగలేదు. పిల్లలకోసం అతని భార్య మొక్కని దేవుడు లేడు. చెయ్యని పూజలేదు.

ఆమె కోరిక ఫలించింది.

మహాలక్ష్మి పుట్టింది. ఆ ఆనందమూ దేవుడికి ఎక్కువకాలం నిలవలేదు. కీళ్లవాతం వచ్చి పెళ్లాం మంచానపడింది. ఆనాటినుంచి మహాలక్ష్మికి అతనే తల్లీతండ్రి అయి పెంచి పెద్దచేసాడు.

ఎన్ని వైద్యాలు చేయించినా, ఎన్ని మందులు వాడినా భార్యరోగం తగ్గలేదు. ఆమె మళ్లీ లేచి భూమ్మీద తిరగలేదు. రోగంతో తీసుకుని తీసుకుని భూమిలో ఇంత మట్టయి కలిసిపోయింది.

మహాలక్ష్మికి పెళ్లీడురాగానే రంగారావనే కుర్రోణ్ణి చూసి పెళ్లి చేసాడు దేవుడు

రంగారావు కుదురైనవాడు. పెళ్లాన్ని, మావగార్ని ఆదరంగా, అభిమానంగా చూసుకునేవాడు. ఆ జంటని చూసి దేవుడు ఎంత ముచ్చటపడిపోయేవాడు.

రంగారావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు.

మంచి జీతం వచ్చేది. పైన బేటా డబ్బులు వచ్చేవి. ఎప్పటికైనా స్వంతంగా ఓ ట్రాక్టర్ కొనుక్కోవాలని అతని ఆశ.

చాలా సంవత్సరాల తర్వాత దేవుడు ఆనందంగా, హాయిగా బతుకుతున్నాడు.

పెళ్లాం వైద్యానికి, ఇల్లు నడపడానికి, మహాలక్ష్మి పెళ్లికి ఓ ఎకరం ఖర్చయిపోయింది.

''నువ్వు కొంచెం డబ్బు కూడాబెట్టుకో. మిగిలిన ఎకరం అమ్మేసి ఆ డబ్బు నీకిచ్చేస్తాను. కొత్త ట్రాక్టర్ కొనుక్కుందువుగానీ— ఇంకా తర్వాత నీకే లోటు ఉండదు.'' దేవుడు అల్లుడితో చెప్పాడు.

కాని దేవుడనే మనిషిని కష్టాలు పడటానికే ఆ దేవుడు సృష్టించినట్టున్నాడు.

ఓ రోజు రంగారావు నడుపుతున్న ట్రాక్టర్ పొలంలో బోల్తాపడింది. అతను దానికింద ఇరుక్కుపోయాడు. అతన్ని బైటికి తీసి అపస్మారక స్థితిలో హాస్పిటల్లో చేర్చారు. పదిరోజులపాటు అతను చావు బతుకుల మధ్య ఊగిసలాడాడు. పదిరోజుల తర్వాత ఊగిసలాట ఆగిపోయింది. అతని ఊపిరి ఆగిపోయింది.



అరవైవేల రూపాయలు ఖర్చుపెడితేగానీ నయంకాని రోగం అతడిది. అంత డబ్బులేదు. తాళితెగిన కూతుర్ని గాలికొదల డానికి లేదు. అన్నీ సర్దుబాటుచేసినా.....

మహాలక్ష్మి కుళ్లికుళ్లి ఏడ్చింది.

రానురాను దేవుడి వంట్లో సత్తువ తగ్గిపోయింది. కూతుర్ని కూలిపనికి పంపడం అతనికిష్టంలేదు.

ఉన్న ఒక్క ఎకరం అమరకం ఇచ్చేసి దాని మీద వచ్చిన పంటతో ఇన్నాళ్లు ఇద్దరూ కాలక్షేపం చేస్తున్నారు.

ఇన్ని సంవత్సరాల్లో ఆ ఇద్దరి బతుకుల్లో ఓ నవ్వు లేదు. ఓ తుళ్లింతలేదు. కాస్త ఉత్సాహం లేదు.

రెండు శవాలకి కాస్తంత ప్రాణం వచ్చినట్టుగా ఇద్దరూ బతుకులు వెళ్లదీస్తున్నారు.

ఇప్పుడు మళ్లీ ఓ కొత్త సమస్య.

ఇన్ని సంవత్సరాల్లో దేవుడితో అంత ఆదరంగా మాట్లాడిన వారు లేరు. అంత తెల్లటి పక్కమీద పడుకోమని అడిగినవారు లేరు. అంత చల్లటిగదిలో కూర్చోమన్నవారు లేరు.

ఒకటి, రెండు, మూడు....

మూడురోజులపాటు అంత పెద్ద బిల్డింగ్‌లో అయిదో అంతస్తులో—ఏ.సి. రూముల్లో రకరకాల పరీక్షలు జరిపారు.

చివరిరోజున డాక్టర్లంతా కలిసి సమావేశమయ్యారు. దేవుడు పడుతున్న బాధకి ఓ పేరు పెట్టారు.

ఆ బాధ తగ్గాలంటే ఆపరేషన్ చేయాలన్నారు.

''బాబూ ఆపరేషన్‌కి ఎంతవుతుంది?'' కూడా వచ్చి మాస్టారబ్బాయిని అడిగాడు దేవుడు.

''ఇంకా చెప్పలేదు. రేపు చెప్తామన్నారు.''

ఆ మర్నాడు కంప్యూటర్లు చకాచకా పనిచేసాయి. ఓ మనిషి మెదడులో వేసిన కాంతి తొలగించాలంటే ఎంత ఖర్చవుతుందో కంప్యూటర్ మెదడు ఆలోచించింది

అరవైవేలు...

''ఎంతా?'' దేవుడు ఆశ్చర్యంగా అడిగాడు.

''అరవైవేలు.''

ఈ బతుకు ఖరీదు అరవైవేలా?

దేవుడికి బాధకలగలేదు.

దేవుడికి ఏడుపురాలేదు.

* * * * *

''ఆ పొలం అమ్మేద్దాం...'' తమ ఊరువెళ్లాక మహాలక్ష్మి అంది.

''ఎందుకూ?''

''నీ ఆపరేషన్‌కోసం''

ఉన్న ఒక్క ఎకరం పొలం అమ్మించేసి ఆ డబ్బులో చచ్చిపోయే తండ్రిని బతికించుకుందామనుకుంటోంది. కాని తర్వాత తన బతుకు ఎలాగడుస్తుందో ఆలోచించుకోడంలేదు దేవుడు అనుకున్నాడు. కూతురి మీద ప్రేమ పొంగింది.

అభిమానం ముంచుకొచ్చింది.

జాలి—ఏరులై, వరదలై ప్రవహించింది.

ఆ రాత్రి దేవుడు ఆరుబైట మంచం మీద వెల్లికిలా పడుకుని ఆకాశానికేసి చూస్తూ ఆలోచించాడు.

పొలం అమ్మేస్తే ఎనభైవేలు వస్తుంది. అందులో అరవైవేలు ఆపరేషన్‌కి ఖర్చు పెడితే—చిల్లరమల్లర అప్పులు తీర్చగా పదిహేనువేలు చేతికి వస్తుంది.

ఆ డబ్బుతో వేరే సంపాదన లేని రెండు జీవితాలు గడపాలి—ఎలా?

ఎన్ని లెక్కలు వేసినా అతనికి జవాబు రాలేదు. ఆ రాత్రంతా అతని మెదడు నిండా లెక్కలు, ఆలోచనలు, జవాబుదొరకని ప్రశ్నలు

ఈతముళ్లలా గుచ్చుకున్నాయి.

తనుపోతే మహాలక్ష్మి ఒంటరిదైపోతుందన్న బెంగతప్ప ఈ భూమికి ఆకాశానికే ఏమీ నష్టంలేదు.

అతనికి సాయిలు గుర్తువచ్చాడు. అదే ఊళ్లో కూలిపనిచేసుకుని బతుకుతాడు. అమాయకుడు. మంచివాడు. అతనికి మహాలక్ష్మి అంటే ఇష్టముందని దేవుడికి తెలుసు. మర్నాడుదయమే సాయిల్ని కలిసి ''ఏరా—మా మా లక్ష్మిని చేసుకుంటావా?'' అనడిగాడు.

సాయిలు ఎగిరిగంతేసాడు.

ఆ సాయంత్రం షాపుకెళ్లి ఎండ్రిన్ డబ్బాకొని తెచ్చుకున్నాడు. గదిలో కూర్చుని తాగేసాడు. మహాలక్ష్మిని పిల్చి 'సాయిల్ని పెళ్లిచేసుకో. ఆ ఎకరం పొలంతో—ఆడి కూలి డబ్బుల్తో హాయిగా బతకొచ్చు. ఆడు నీకు తోడు. నువ్వు ఒంటరి దానివి కాదు.' అని చెప్పాడు.

ప్రాణం పోయేముందు ఒకే ఒక ప్రశ్న అతని మనసుముందు యమభటునిలా నుంచుంది.

''పేణం నిలబెట్టుకోడానికీ డబ్బు కావాలి. తీసుకుడానికి డబ్బుకావాలి—ఛీ ఇదేం పెపంచం?''